
# ఇదీ ఓ బతుకు కథే!



**కె. వరలక్ష్మి**

**వా**ళ్లిద్దరూ ఎక్కిన బస్సు కనుమరుగయ్యేవరకూ చూసి కర్చీఫ్‌తో కళ్లద్దుకుని వెనక్కి తిరిగింది మిసెస్ వెల్మా.

ఆ బస్సులో వెళ్తున్నది ఆమె పెద్ద కూతురు మారియా, కాబోయే అల్లుడు డేవిడ్. మారియా ఇరవయ్యో సంవత్సరంలోకి అడుగుపెట్టింది. నాలుగేళ్లుగా ఆ అమ్మాయికి బోయ్‌ఫ్రెండ్స్ చాలామందే ఏర్పడ్డారు కానీ, పెళ్లి వరకూ వచ్చినవాడు డేవిడ్ ఒకడే. అందుకే మారియా తను టీచర్‌గా పనిచేస్తున్న పనసలపాడుకి డేవిడ్‌తో డేటింగ్ కోసం బయలుదేరింది.

నిజం చెప్పాలంటే మిసెస్ వెల్మాకి తమ జాతి సాంప్రదాయాలంటే ఒళ్లుమంట. ఎప్పుడో నలభై ఏళ్ల క్రితం ఇండియాను వదిలి వెళ్లిపోయిన ఇంగ్లీషువాళ్ల మాసిపోయినా చిత్రాల్లా, వాళ్ల పద్ధతుల్ని అనుసరిస్తూ అటు ఇంగ్లాండ్ వెళ్లినా వాళ్లతో కలుపుకోక, ఇటు ఇండియన్స్‌తో కలవలేకా, లేని భేషజాల్ని నటిస్తూ, ఇంట్లో ఈగలమోతా బైటపల్లకీ మోతా అన్నట్టు గడిపేస్తున్న తమ జాతంటే విపరీతమైన కోపం. తమ పూర్వీకులు రైల్వే ఆఫీసర్లుగా గొప్ప వెలుగు వెలిగితే, ఈనాటి ఆంగ్లో ఇండియన్ కుర్రకారు మామూలు రైల్వే ఉద్యోగానికి కూడా క్వాలిఫికేషన్ సంపాదించలేకపోతున్నారు. అందుకే ఆడపిల్లకి పెళ్లి చెయ్యాలంటే తమ వాళ్లలో తగిన వరులు దొరక్క, ఎవడో ఒకడికి కట్టబెట్టాల్సి వస్తోంది. చాలామంది పెళ్లి కాకుండా ఉండిపోతున్నారు, లేదా ఎవరో ఒక డబ్బున్న ఇండియన్‌కి ఉంపుడుకత్తెగా ఉండిపోతున్నారు.

అదృష్టం కొద్దీ డేవిడ్ తమ జాతివాడే. డేవిడ్ మద్రాసీ. తమిళనాడు ఆంగ్లోఇండియన్స్ చాలా మందిలాగే నల్లగా ఉంటాడు. అతని రక్తంలో ఏతరంలోనో నీగ్రో రక్తం కలిసిందేమో తెలీదు కాని, ఉంగరాలు తిరిగిన పొట్టిజట్టు, లావు పెదవులు, బలిష్టమైన శరీరంతో చూపులకి మొరటుగా ఉంటాడు.

మారియాకి అతన్తో పరిచయమై పదిరోజులే అయ్యింది. డేవిడ్ నేవీలో పనిచేస్తున్నాడు. ఈ సెలవుల్లో పెళ్లి చేసుకుని, తిరిగి షిప్‌మీదికెళ్లాలని గట్టిగా నిశ్చయించుకున్నాడు.

అతని అదృష్టమేమో అన్నట్టు దసరా సెలవులకి ఆంధ్రానుంచి వాళ్ల ఆంటీ ఇంటికి మద్రాసు వచ్చిన మారియాని చూడగానే అతనికి స్పృహతప్పినంతపనైంది. కన్ను చెదిరిపోయే అందం మారియాది. పాలమీగడలో గులాబీలు రంగరించిన ఒంటిరంగు. నేచురల్‌గానే కాటుక దిద్దుకున్నట్టున్న కనురెప్పలు. విల్లులా వంపు తిరిగిన కనుబొమలు. కనుబొమ్మల మధ్య నల్లని పెసరగింజంత పుట్టుమచ్చ. లిప్‌స్టిక్‌తో మెరిసిపోతున్న అందమైన పెదవులు.

ఫెన్సింగ్‌లోపల బట్టలారబెడుతున్న మారియా కేవలం మోకాళ్లపైకున్న ఇంట్లోవేసుకునే లోపలిగౌనుతో ఉంది. ఆటోవాడు గుర్తు చేసేవరకూ డేవిడ్ సూట్‌కేస్ తీసుకుని లోపలికి వెళ్లడం మరచిపోయాడు. మర్నాడు రాత్రి ఆ స్ట్రీట్‌లోనే ఉన్న మిస్టర్ జాన్సన్ మేరేజ్ పార్టీలో మారియాని దగ్గరగా చూడడం తటస్థించింది. తనతో డేన్స్ చెయ్యాలని ఉవ్విళ్లూరుతున్న కుర్రకారందర్నీ వదిలేసి, మారియా తన చెయ్యి డేవిడ్‌కి అందించింది.

డేవిడ్ ఒంట్లో వెయ్యి ఓల్టుల విద్యుత్తు ఒక్కసారిగా ప్రవహించినట్లైంది. అప్పటికే ఒకరిసంపాదన గురించి మరొకరు వివరాలన్నీ తెలుసుకున్నారని ఇద్దరికీ తెలీదు. అప్పుడే నిర్ణయించుకున్నాడు ఎలాగైనా ఆ అమ్మాయి వేలికి వెడ్డింగ్ రింగ్ తొడగాలని.

ఆ పార్టీలో రమ్, జిన్ వెల్లువలా ప్రవహించాయి. పరిచయమైన హుషారులో ఇద్దరూ కొంచెం ఎక్కువగానే డ్రింక్ చేశారు. పార్టీముగిసేసరికి తన మీదికి ఒరిగిపోయిన మారియాని డేవిడ్ జాగ్రత్తగా నడిపించుకుని ఇంటికి తీసుకొచ్చాడు.

ఆ అమ్మాయి గురించి వివరాలన్నీ సేకరించాడు.

మూడు నాలుగు తరాల వెనక లండన్ నుంచి వచ్చి ఆంధ్రాలో కలెక్టర్‌గా పని చేసిన వెల్మన్ దొరగారికి, ఆంధ్రా జమిందారీ కుటుంబంలోని అందాల సుందరికి పుట్టిన బిడ్డతో వెల్మా వంశం మొదలైందట. మారియా తండ్రి రైల్వేలో ఫైర్‌మేన్. అతని సంపాదన అతని తాగుడుకే సరిపోదట. మారియా తల్లి మిసెస్ వెల్మా రైల్వే స్కూల్లో టీచర్‌గా పనిచేస్తూ సంసారాన్ని ఈడ్చుకొస్తోంది. ఆవిడకి మారియా తర్వాత తొమ్మండుగురు సంతానం. ప్రస్తుతం పన్నెండో ప్రాణి ఆమె గర్భంలో ఉందట. తమజాతి తమకి బతకడానికి దారిచూపించదుకాని రోమన్ కేథలిక్ మతం ధర్మమా అని జనాభాని మాత్రం అపరిమితంగా పెంచేస్తోంది.

రెండ్రోజుల్లో మారియా వెళ్లి పోతుందని తెలిసి డిన్నర్‌కి పిలిచాడు. డేవిడ్ తల్లికి మారియా బాగా నచ్చింది. ఆ పిల్ల తన కోడలైతే నాగపట్నం వెళ్లి మేరీమాత గుడికి వన్‌థౌజండ్ రూపీస్ ఇస్తానని మొక్కుకుందావిడ. మటన్ కట్లెట్స్, బీఫ్ సూప్, పిగ్గీ చిప్స్, చికెన్ పటోటా స్పెషల్‌గా తయారు చేసింది.

డేవిడ్‌కిప్పుడు ముప్పై రెండేళ్లు. షిప్‌మీదికి వెళ్లి తిరిగి ఇండియాకి ఎప్పుడొస్తాడో తెలీదు. ఇన్నాళ్లుగా ఏ పిల్లని చూసినా ఏదో ఒక వంక పెట్టేవాడు. నిజానికి చాలా మంది ఆడపిల్లలకి డేవిడ్ నల్లని ఒంటి రంగు నచ్చేది. ఒక్కగానొక్కకొడుకూ దేశాలమీదికి పోతే, ఒంటరిగా ఉండడం ఆమెకిక సాధ్యం కావడం లేదు. తనకి సాయంగా కోడలు రావాలని,త్వరలోనే మనవల నెత్తుకోవాలనీ చాలా ముచ్చటపడుతోంది.

మారియా వచ్చేసరికి టేబుల్‌నీట్‌గా సర్ది ఉంచాడు డేవిడ్. ఎంబ్రాయిడరీ చేసిన చైనీస్‌క్లాత్ టేబుల్‌మీద పరిచాడు. జపనీస్ పింగాణీ కూజాలో లిల్లీ ఫ్లవర్స్ ఉంచాడు. జర్మన్ గ్లాస్ డిషెస్‌లో తల్లి చేసిన పదార్థాలు నింపేడు. ఫారిన్ స్కాచ్, జిన్ కలిపి డ్రింక్ తయారు చేసి పెద్ద మగ్గులో పోసి ఉంచాడు. ఐస్ ముక్కలు కరిగిపోకుండా ఫ్లాస్క్‌లో వేసి ఉంచాడు. ఎర్రగులాబీల గుత్తినొకదాన్ని చేత్తో పట్టుకుని వీధి గుమ్మంలో నిలబడి, మాటి మాటికీ ఎదురింటివైపు చూడసాగేడు. ఎట్టకేలకు రాత్రి ఎనిమిది గంటలకి మారియా బైటికొచ్చింది. జిగేల్మని మెరిసిపోయే చెమ్కీలున్న ఎర్రగౌను తొడుక్కుంది. అదేరంగులిప్‌స్టిక్ పెదవులకి మందంగా వేసుకుంది. ఒక్క అంగలో మెట్లుదిగి చెయ్యందించిమారియాని లోపలికి తీసుకొచ్చాడు డేవిడ్.

" హలో " డేవిడ్ తల్లిని విష్ చేసింది మారియా.

ఒక్క పది నిమిషాలు వాళ్లతో కూర్చుని, వాళ్లిద్దరికీ ఏకాంతం కల్పించడం కోసం తన గదిలోకి వెళ్లిపోయిందావి.

రెండు గ్లాసుల్లో డ్రింక్ పోసి, ఒక గ్లాస్ మారియా కందించాడు డేవిడ్.

"థాంక్స్"

గ్లాసును పట్టుకున్న మారియా చేతివేళ్లు చూస్తుంటే డేవిడ్ మనసు ఉరకలెయ్యసాగింది. ఆ ఎర్రటి ఏపిల్ ముక్కల్లాంటి పెదవుల్ని చూస్తుంటే అతని రక్తం మరిగిపోతోంది.

ఇదివరకు అతనికి ఆడవాళ్లతో పరిచయం లేకపోలేదు. షిప్ ఆగిన ప్రతిచోటా ఫ్రెండ్స్‌తోబాటు బైటికి వెళ్లి శారీరక వాంఛల్ని చల్లబరుచుకుని వస్తాడు. కాకపోయినా, ఆంగ్లో ఇండియన్ సొసైటీలో సెక్స్ గురించి రెస్ట్రిక్షన్స్ లేవు. అందుకే పదమూడేళ్ల వయసొచ్చిన ఏ అమ్మాయికైనా కావాల్సినంత మంది బోయ్‌ఫ్రెండ్స్, వీలైతే డేటింగ్స్;అలాగే మగ పిల్లలూను.

"మిస్ వెల్మా"

"ఊం.."

"నేనంటే నీ అభిప్రాయం ఏమిటి ?"

దానిమ్మ గింజల్లాంటి పలువరుస కన్పించేలా ఫక్కున నవ్వింది మారియా.

" మైగాడ్, నీతో అసలు పరిచయమైందెక్కడ, ఇంతలోనే అభిప్రాయం ఎలా చెప్పెయ్యను ?"

"పోనీ ఇది చెప్పు, నీకింకా బోయ్‌ఫ్రెండ్సున్నారా ?"

"ఆ.. చాలామంది"

"ఎవరితోనైనా డేటింగ్ జరిగిందా ?"

"వైనాట్ ? ఇద్దరితో "

గుటకలు మింగాడు డేవిడ్.

" మరి.. మేరేజ్ ఎందుకు చేసుకోలేదు ?"

"వాళ్లతో సెక్స్ నాకు నచ్చలేదు"

చెప్పలేని సంతోషం ముంచుకొచ్చింది డేవిడ్‌కి.

"ఇఫ్‌యూ నెవర్ మైండ్, ప్లీజ్ ట్రై విత్ మి "

" విత్ ప్లెజర్. కానీ, నేను రేపే వెళ్లిపోతున్నానే, ఎలా?"

" నేను నీతో వస్తాను "

"ష్యూర్ ?"

"ష్యూర్"

" ఓ.కె"

ఆ తర్వాతంతా సంభాషణ ఒకరి ఇష్టాలొకరు తెలుసుకోవడంతోసాగింది. మారియా తనకి డ్రింక్ చెయ్యడం,ఎస్పెషల్లీ డ్రింక్‌తో అరటిపళ్లు తినడం, మంచి బట్టతలేసుకోవడం, ఖరీదైన కాస్మెటిక్స్ గిఫ్టుల రూపంలో పొందడం ఇష్టం అని చెప్పింది.

డేవిడ్ తనకి దేశాలన్నీ తిరగడం, డ్రింక్స్‌తోబాటు మంచి ఫుడ్ తినడం ఇష్టం అని చెప్పేడు.

ఇద్దరికీ కామన్ విల్లింగ్ తాగడం అని తేలింది. డేవిడ్ తను సెలవు పెట్టి వచ్చినపుడల్లా మంచి ఫారిన్ లిక్కర్స్ తెస్తానని ప్రామిస్ చేశాడు.

ఆ కాన్వర్సేషన్ ఫలితమే మారియా, డేవిడ్‌ల పనసల పాడు ప్రయాణం.

***

మారుమూల పల్లెల్లో కూడా కాన్వెంటు స్కూల్సున్న ఈ రోజుల్లో పల్లె పట్నంకాని పనసలపాడులో నాలుగు కాన్వెంట్లున్నాయి. సాధారణంగా పల్లెల్లో స్కూల్లో ఏం చెప్పున్నారన్నది కాక, స్కూలుకి ఎంత షో చేశారో చూస్తారు. అందుకే ఆ స్కూలు కరస్పాండెంటు కష్టమో, నష్టమో భరించి మారియాని టీచర్‌గా నియమించుకున్నాడు. స్కూల్లోనే ఒక రూం ఇచ్చి, అన్ని సదుపాయాలు కల్పించాడు.

వచ్చిన కొత్తలో మారియా ఆ ఊరి జనానికొక ఎస్సెట్ అయి కూర్చుంది. బైటికొస్తే చాలు ఊరు ఊరంతా ఆవిడ వెనకే ఉండేది. ఆవిడని చూడ్డానికొచ్చే జనంతో స్కూలు పరిసరాలు నిండిపోయేవి. మోకాళ్ల పైకి ఉండే ఆమె గౌన్లగురించీ, ఎత్తు మడమల చెప్పుల గురించీ, కత్తిరించుకున్న జుట్టుగురించీ పెదవులకి పూసుకున్న రంగు గురించీ కథలు కథలుగా చెప్పుకునేవారు. ఏడేడు సముద్రాలకవతల ఏదో దేశం నుంచి ఆవిడ ఇక్కడికి ఊడిపడిందనీ, అందుకే ఆ ఒంటి రంగు అంత తెల్లగా ఉందనీ వాళ్ల ఉద్దేశం. ఆ దేశాల్లో ఉండేవాళ్లంతా అంత అందంగా ఉంటారని కొందరూ, ఉండరని కొందరూ పందాలు కాశారు. ఆమెను చూస్తేనే జన్మ తరించి పోతుందనుకునే కుర్రకారు ఆ పరిసరాల్లోనే నిరంతరం తచ్చాడేవాడు.

క్రమంగా ఆ క్రేజ్ తగ్గినా ఇంకా కొందరు ఆమె మీదనే కన్నేసి ఉంచారు. అలాంటి వాళ్లలో ఆ ఊరి సర్పంచ్ తమ్ముడు రాఘవరావొకడు. అతనికిదివరకే మేనరికం కుదిరిపోయింది.

అతను తరచుగా సినిమాలు చూడ్డం కోసం పట్నం వెళ్లాడుకాబట్టి అప్పుడప్పుడు ఆంగ్లో ఇండియన్స్‌ని దూరం నుంచి చూడ్డం తటస్థించింది. మారియాని చూశాక, వాళ్ల గురించి కొంత సమాచారం సేకరించాడు. కేవలం గౌన్లు, పౌడర్లు లాంటి గిఫ్టులు చాలు ఆంగ్లో ఇండియన్ అమ్మాయిల్ని వెంట తిప్పుకోడానికి అని తెలుసుకున్నాడు. అందుకే గత మూడు నెలలుగా మారియాకి రకరకాల గిఫ్టులు ఇచ్చి ఆమెతో పరిచయం పెంచుకున్నాడు.

ఆమె ఊళ్లో లేని గత పదిహేను రోజులుగా ఆమె ఎదుట వల్లించవలసిన ప్రేమ పాఠాల్ని పదేపదే వల్లెవేసుకుని రెడీగా ఉన్నాడు. ఇప్పుడిప్పుడు మారియా తెలుగు బాగా అర్థం చేసుకోగలుగుతోంది. ఇంతలో ఇప్పుడిలా ఆఫ్రికన్ వస్తాదులాంటివాణ్ని మారియా వెంటబెట్టుకురావడం రాఘవకి కొంచెం కూడా నచ్చలేదు.

ఆమెరాగానే వెళ్లి, ప్రేమాకాశంలో తేలిపోతూ 'హలో' అంటూ పలకరించబోయిన తనని కొంత విసుగు నింపుకున్న కళ్లతో ఆమె చూసిన చూపు పాతాళంలోకి విసిరేసింది రాఘవని.

**వచ్చిన రోజు రాత్రే మారియా డేవిడ్‌ల డేటింగ్‌కి మొదటి రాత్రైంది. చర్చిలో పెళ్లంటూ జరగలేదు కాని, అచ్చం భార్యాభర్తల్లా ప్రవర్తించసాగేరు వాళ్లిద్దరూ.**

అసలు సిసలైన ఆంగ్లో ఇండియన్ దొరగారల్లే డేవిడ్ మారియాకి సేవలు మొదలు పెట్టాడు. ఉదయం ఆమె లేచేవేళకి కాఫీ కప్పుతో రెడీగా ఉంటున్నాడు. టిఫిన్ టైంకి ఎగ్‌టోస్టు, బ్రెడ్ రెడీ చేస్తున్నాడు. ఆమె ముస్తాబై స్కూలుకెళ్లాక, ఆమె విప్పేసిన బట్టలన్నీ ఉతికి ఆరబెడుతున్నాడు. మధ్యాహ్నం వంట, రాత్రికి చపాతీలు అన్నీ డేవిడ్ స్వహస్తాలతో సంతోషంగా చేస్తున్నాడు. సాయంత్రం ఇద్దరూ కల్సి అలా పొలాల గట్లంట షికారుకి వెళ్లారు. రాత్రి వాళ్ల నవ్వులూ తుళ్లింతలతో నైట్ వాచర్ తాతకి నిద్రపట్టడం మానేసింది. హంస, కాకిలాంటి వాళ్ల జంటను చూస్తుంటే చాలా చిత్రంగా ఉందతనికి. ఒక్కొక్కరోజు గ్లాసుల గలగలల్తో వాళ్ల సరసం ముదిరి పాకాన పడుతుండేది. డస్టర్లు, చాక్ పీసుల్తో ఒకర్నొకరు కొట్టుకుని ఆనందించేవాళ్లు.

నెల గడిచేసరికి డేవిడ్ సూట్‌కేసులోని డబ్బుతో బాటు లిక్కర్ బాటిల్స్ కూడా ఖాళీ అయ్యాయి. అప్పుడు గుర్తొచ్చింది వాళ్లకి ఇంకా పెళ్లి చేసుకోలేదని.

డేవిడ్‌కి సెలవు మరో పదిహేను రోజులు మాత్రం ఉంది. ఈ తరహా లైఫ్ కూడా బోర్‌గా ఉంది.

ఎప్పుడెప్పుడు వెళ్లి షిప్పులో వాల్దానా అని ఉందతనికి ఆ రోజు ఫస్టు తారీఖు. మారియాకి జీతం అందింది.

" మారియా ! రెండు వందలివ్వు " అడిగాడు డేవిడ్.

" అదెలా ? నా జీతం మొత్తం మా అమ్మకి పంపించాలి నేను " అంది మారియా.

" ఏం, ఎందుకు పంపించాలి ? మన పెళ్లి ఖర్చులకా?"

" మనపెళ్లి ఖర్చు మా వాళ్లెందుకు పెట్టాలి ?"

" నేనే పెట్టాలనుకో.. నా దగ్గర డబ్బైపోయింది "

" అంత డబ్బు లేనివాడివి పెళ్లికెందుకు తయ్యారయ్యావ్ ?"

డేవిడ్ మొహం గంటు పెట్టుకున్నాడు. " మారియా ! నీతో ఒక విషయం మాట్లాడాలి " అన్నాడు సీరియస్‌గా.

" ఏంటది ?"

" ఇకపైన మీ వాళ్లకి నువ్వు డబ్బు పంపించడం కుదరదు "

" ఏం, ఎందుకని ?"

" మన మేరేజ్ తర్వాత మా అమ్మ నీ దగ్గరుంటుంది కాబట్టి "

" ఎందుకలా ?"

" అక్కడ మద్రాసులో హౌస్ రెంట్ వేస్ట్ కదా, పోనీ నువ్వు మద్రాసులో జాబ్ చూసుకున్నా సరే "

" పెళ్లి కాకుండానే చాలా అథార్టీ చేస్తున్నావే ! అదంతా ఏం కాదు, నాకు బోయ్‌ఫ్రెండ్సున్నారని జెలసీ నీకు. మీ అమ్మను నాకు కాపలాగా ఉంచుతావు కాబోలు "

" పోనీ అలాగే అనుకో "

" మా ఇద్దరి ఖర్చుకీ నువ్వెంత పంపిస్తావ్ ?"

" నేనా, పంపడమా ?" నవ్వేశాడు డేవిడ్. " నా జీతం నాకే చాలదు తెలుసా ?"

" అలాగైతే మీ అమ్మను కూడా నేనే పోషించాలన్న మాట !"

" పెళ్లయితే నీకు అత్తగారవుతుంది కదా ! "

" డేవిడ్ ! మా కుటుంబం పెద్దది. నేను పంపే డబ్బు, మా అమ్మ సేలరీ చాలక ఇంట్లో ఇంకా ఇబ్బంది పడుతుంటారు. ఏదో, నువ్వు నేవీలో వర్క్ చేస్తున్నావ్, డబ్బు పంపిమావాళ్లకి సాయపడతావని నీతో మేరేజ్‌కి ఒప్పుకున్నాను "

" ఇదింకా బావుంది. మీ వాళ్లకి నేనెందుకు పంపాలి?"

" లేకపోతే నీలో ఏం చూసి ఒప్పుకున్నాననుకున్నావ్?"

ఆ మాటకి డేవిడ్ ముఖంలోకి రక్తం పొంగి వచ్చింది.

" యూ డెవిల్, షటప్ " అరిచాడతను.

" ఫస్ట్ యూ షటప్ అండ్ గెటౌట్ "

రోజూలాగే స్థిమితంగా ఆనందిస్తున్న నైట్ వాచర్ తాతకి ఆంగ్లంలో సాగుతున్న ఆ సంభాషణలో చిటపటలున్నట్టు చాలా సేపటిక్కాని అర్థం కాలేదు.

" నన్నంతమాటంటావా ?"

" లేకపోతే ఏంటి నీ బోడి గొప్ప ?"

" యూ బిచ్ "

" యూ రాస్కెల్ "

" ఐవిల్ కిల్ యూ "

ఒక గాడ్రేజ్ ఛెయిర్ విసిరేసిన చప్పుడు. మరో బెంచి నేలమీద పడిన చప్పుడు. వాచ్‌మేన్ లేచి కిటికీ లోంచి చూసేసరికి ఒకరి జుట్టొకరు దొరక బుచ్చుకుని పెనుగులాడుతున్నారు.

వాచ్ మేన్ చూపుడువేలు ముక్కు మీదికి పోయింది. అశ్చర్యంతో కళ్లు పెద్దవయ్యాయి.

"హన్నన్నా ! ఇంత సోకుల్లేసుకుని తిరిగే ఈళ్లూ మన అలగా జనం లాంటోళ్లేనన్నమాట ! కాని, ఆ ఆడకూతుర్ని జాడాల, బలే పిల్ల ! ఇంత ధైర్నం మన ఆడోళ్ల కెక్కడిదీ ? మొగోడు కొట్టినా, తిట్టినా పడుంటారు " అనుకున్నాడు.

పైసా ఖర్చులేని వినోదం చూడ్డానికి చుట్టుపక్కల వాళ్లు చాలామందే స్కూలు కాంపౌండ్లో పోగయ్యారు.

వాళ్లిద్దరి ఒంట్లో ఓపికైపోయేవరకూ పెనుగులాట కొనసాగింది.

ఆతర్వాత వగురుస్తూ చెరోగోడకీ చేరబడిపోయారు.

కొంతసేపటి తర్వాత డేవిడ్ చివుక్కున లేచి తన బట్టలన్నీ చకచకా సర్దేసుకున్నాడు. సూట్‌కేస్ చేతిలోకి తీసుకుని మారియా వైపు కొరకొరా చూసి " గుడ్ బై ఫరెవర్ " అంటూ బైటికి నడిచాడు. వరండా మెట్లు దిగుతూ " డర్టీ వుమన్ " అని గొణుక్కుంటున్నాడు డేవిడ్.

అదే సమయంలో బైట ఉన్న జనంలోంచి రాఘవరావు మారియాని ఓదార్చడానికి లోపలికి వెళ్తున్నాడు.

అతని పెళ్లింక వారం రోజుల్లో ఉంది.

'జగాలు మారినా – యుగాలు మారినా మారలేదు అతివల గాథ ' అనీ, మగవాడి జీవితంలో ప్రాక్టికాలిటీకి తప్ప సెంటిమెంట్స్‌కి చోటుండదనీ మారియాకెవరు చెప్తారు ?